క్లుప్తంగా

ప్రకృతిని పరిరక్షిస్తేనే భవిత



మట్టిని కలశంలోకి వేస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం: ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా చోడవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద మట్టి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ భూమిని కాపాడుతుంటేనే ప్రకృతిని కాపాడుకోగలుగుతామన్నారు. ప్రతీ ఒక్కరూ చెట్లను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఎంపీపీ గాడి కాసు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఎంపీపీ సాయం



సాయం అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

గొలుగొండ: ఐదు రోజులు క్రితం గుండిపాలలో గ్యాస్ లీకేజీ కారణంగా ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితులకు ఎంపీపీ గజ్జలపు మణికుమారి బియ్యం, ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన అన్నదమ్ములు రాజుబాబు, తాతలుకు 55 కిలోల బియ్యంతో పాటు నగదు అందించారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. స్థానికులు కూడా వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాగు రాజు, ఎంపీటీసీ కొరుప్రోలు నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకుడు జాగు రామకృష్ణ పాల్గొన్నారు.

మండలానికి 34,500 డస్ట్‌బిన్లు

నాతవరం: మండలంలోని ప్రజలు ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వీలుగా 34,500 డస్ట్‌బిన్లను ప్రభుత్వం అందించినట్లు ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. అమరావతి నుంచి వచ్చిన డస్ట్‌బిన్లను ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రతి ఇంటికీ డస్ట్‌బిన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత ప్రధానమన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. తడి, పొడి చెత్త సేకరించడంలో ప్రజలపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వమే డస్ట్‌బిన్లు అందిస్తోందన్నారు. ఇలా సేకరించిన చెత్తను ఇంటింటికీ వచ్చే తమ సిబ్బందికి అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ చీడికాడ మండల సమావేశం నేడు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ చీడికాడ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జైతవరంలో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, పీఏసీఎస్, పాల సొసైటీ అధ్యక్షులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యునిగా చలపతిరావు

నర్సీపట్నం: నర్సీపట్నం డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యులుగా గొలుగొండ మండలం, జోగంపేటకు చెందిన చిట్ల చలపతిరావు నియమితులయ్యారు. డివిజనల్ మానిటరింగ్ చైర్మన్, ఆర్డీవో హెచ్‌వీ జయరాం చేతుల మీదుగా బుధవారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. చలపతిరావును జిల్లా మానటరింగ్ కమిటీ సభ్యుడు మార్తి అప్పలరాజు, స్వేరో డివిజన్ నాయకుడు సాల్మన్‌రాజు, ఎస్సీ నాయకులు నూకరాజు, యాదగిరిదాసు, సతీష్, సీహెచ్ గంగరాజు గజమాలతో సత్కరించి, అభినందించారు. దళిత ఉద్యమాలకు తాను చేసిన సేవలను గుర్తించి డివిజన్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

త్రైలోక్య రక్షాకరీ.. మాతాన్నపూర్ణేశ్వరీ

అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే.. అంటూ అమ్మవారి ఆలయాలు, మండపాలు హోరెత్తాయి. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల మహాలక్ష్మిగా అలంకరించారు. అన్నపూర్ణేశ్వరిని స్మరించుకుంటూ భక్తులు పలు చోట్ల అన్నసమారాధన నిర్వహించారు.

- కన్నులపండువగా శరన్నవరాత్రులు
- అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

మాడుగుల: మాడుగుల ఆరాధ్య దేవత దేవీతల్లీ బుధవారం అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ దేవరాపల్లి శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు.

రావికమతం: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు వేపా రామకృష్ణ కిషోర్ అమ్మవారికి నైవేద్యంగా దద్యోజనం సమర్పించారు.పరిసర గ్రామ ప్రజలకు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు.

మహాలక్ష్మిగా దుర్గమ్మ

బుచ్చెయ్యపేట: సీతయ్యపేట దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి తొమ్మిది రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సూర్య నమస్కారాలు, ప్రత్యేక పూజలు జరిపారు. వడ్డాది భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో దుర్గమ్మను మహాలక్ష్మిగా అలంకరించి, అమ్మవారికి శాఖాన్నం నైవేద్యంగా పెట్టారు.

గొలుగొండ: నాగాపురం గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా భారీ అన్న సమరాధన నిర్వహించారు. నాగాపురం, పల్లావూరు, కుమారపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధికంగా హాజరయ్యారు. సర్పంచ్ యలమంచిలి రఘురాంతో పాటు గ్రామస్తులు సహకారం అందించారు.

ఎం.కోడూరులో సారె ఊరేగింపు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలోని దుర్గాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భారీ సారె ఊరేగించారు. అనంతరం కుంభవాయనంగా మహానివేదన చేశారు. అమ్మవారి పాదాలను ఆలయ నిర్వాహకులు కోలా రాము తలపై ధరించి, వందలాది మంది భవానీలు తెచ్చిన రకరకాల తీపి పదార్థాలతో పుర వీధుల్లో ఊరేగించి, అమ్మవారికి నివేదించారు.

నర్సీపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భవానీ మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయం వద్ద భవానీ అంబలం పూజ బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు వేపా రామకృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో గ(ట్రెడ్డి దివాకర్ దంపతుల చేతుల మీదుగా పూజ, భజన నిర్వహించారు. భక్తులకు భోజన(బిక్ష) వసతి ఏర్పాటు చేశారు.



అన్నపూర్ణగా దర్శనమిచ్చిన మాడుగుల దేవీతల్లి



కొత్తకోటలో అన్నపూర్ణ అవతారంలో దుర్గమ్మ



సీతయ్యపేటలో మహాలక్ష్మిగా అమ్మవారికి అలంకరణ



ఎం.కోడూరులో అమ్మవారికి నివేదించిన పిండివంటలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కూచిపూడి నృత్య ప్రదర్శన



రావికమతం కొత్తకోటలో అంబలం పూజ

అగ్ని బాధితులకు నవ్య లయన్స్ క్లబ్ సాయం

నర్సీపట్నం: గుండుపాల అగ్ని బాధితులకు నర్సీపట్నానికి చెందిన నవ్య లయన్స్‌క్లబ్ అండగా నిలిచింది. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలను క్లబ్ గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, అధ్యక్షుడు జి.చంద్రరాజు, జోన్ చైర్మన్ చెరుకూరి ఇందిర, వెలగా నారాయణరావు, సభ్యులు కన్నబాబు, రామ్‌గోపాల్, పద్మనాభుని కన్నయ్యశెట్టి పరామర్శించారు. నెల రోజులకు సరిపడా బియ్యం, కిరాణా సామగ్రితో పాటు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధితుల పరిస్థితిని చూసి క్లబ్ సభ్యులు ఇందిర, వెలగా నారాయణరావు ప్రతి నెలా రూ.2 వేలు అందిస్తామన్నారు. సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ గృహ నిర్మాణ సమయంలో మరింత ఆర్థిక సాయం అందిస్తామన్నారు. స్థానికులు కూడా బాధితులకు అండగా నిలిచి, ఆర్థిక సాయం అందించాలని కోరారు. సర్పంచ్ జోగి రామకృష్ణ పాల్గొన్నారు.



అగ్ని బాధితులకు నగదు, నిత్యావసర సరకులు అందిస్తున్న సన్యాసిపాత్రుడు, క్లబ్ సభ్యులు

కడారికి డిప్యూటీ సీఎం బూడి పరామర్శ



కడారి రమణను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కడారి రమణను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం పరామర్శించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న రమణ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యపరమైన సేవలతో పాటు, అన్ని విధాలుగా అండగా నిలుస్తామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. డిప్యూటీ సీఎం వెంట జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వంటాకు శ్రీను, కొమ్మినేని సన్యాసినాయుడు, తమటపు శంభునాయుడు, కొట్యాడ కిష్టమ్మ, బీలా ఈశ్వరరావు, అల్లు సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం ఆసరా

- మండలంలో ఆరు గ్రామాల్లోని చెరువుల్లో చేప పిల్లల విడుదల

కె.కోటపాడు: మత్స్యకారులు ఆర్థికంగా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని మేడిచర్ల గ్రామం రాజుచెరువులో బుధవారం చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీపై మత్స్యశాఖ అందిస్తున్న చేపపిల్లల్ని చెరువుల్లో వదిలినట్లు పేర్కొన్నారు. నర్సీపట్నం డివిజన్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగమణి మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామాల్లోని చెరువుల్లో 19,600 చేపపిల్లలను వేసినట్లు తెలిపారు. ఈ చేప పిల్లలు ఆరు నెలల్లో అమ్మకానికి సరిపడా బరువు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, పూడి నారాయణమూర్తి, కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు(నీలిమ), తర్రా శేషు, గ్రామ మత్స్యశాఖ సహాయకులు బి.అప్పలపాత్రుడు, కిరణ్మయి, నానాజీ పాల్గొన్నారు.



మేడిచర్ల రాజుచెరువులో చేప పిల్లల్ని వేస్తున్న అనురాధ, జగన్‌మోహన్

రహదారిలో వాహనాల నిలిపివేతపై ఫిర్యాదు

బుచ్చెయ్యపేట: రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపి, ట్రాఫిక్ ఇక్కట్లకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బుచ్చెయ్యపేట పంచాయతీ కార్యదర్శికి జ్యోతికి గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై వాహనాలను నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉప సర్పంచ్ దేవి, అప్పారావు, మహాలక్ష్మినాయుడు, నరసింహస్వామి, పాలబాబు ఉన్నారు.



ఆస్పత్రికి వెళ్లే రోడ్డుపై నిలిపిన వాహనాలు

‘ఉత్తరాంధ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం’

చోడవరం: వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు రాజ్యమేలుతుండటం వల్ల వెనుకబడిన ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు అభివృద్ధి చెందలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోలవరం కాలువ కొంతమేర నిర్మాణం చేసినప్పటికీ, తర్వాతి ప్రభుత్వాలు మిగిలిన పనుల్ని పూర్తి చేయలేదన్నారు. దీంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి సమస్య అపరిష్కృతంగానే ఉందన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆప్కాబ్‌కు చెల్లించాల్సిన రూ.50 కోట్ల రుణాన్ని ఏక కాలంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకుడు కందర్ప రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



గున్నెంపూడిలో వైద్య శిబిరం నిర్వహణను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

- జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యం మరింత చేరువ
- సురక్ష వైద్య శిబిరాలను పరిశీలించిన విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే గణేష్

చోడవరం/బుచ్చెయ్యపేట: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని గాంధీగ్రామం, బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధితోపాటు విద్య, వైద్యం అందరికీ అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గాంధీగ్రామం శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ పర్యవేక్షించారు. గ్రామసర్పంచ్ గాడి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 432 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమల బాబు, టెలికాం అడ్వయిజరీ మెంబర్ వేచలపు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, హైస్కూల్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్, మండల సచివాలయ కన్వీనర్ పతివాడ అప్పారావు, గున్నెంపూడి శిబిరంలో వైద్యులు కె.రమేష్, కిరణ్‌కుమార్, శ్రీ కావ్య, సుమిత్ర ప్రియ తదితరులు 467 మంది రోగులకు పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ ముచ్చకర్ల హరిణి అప్పారావు, ఎంపీటీసీ సుశీల వెంకటరమణ, స్థానిక నాయకులు సోమిరెడ్డి సత్తిబాబు, అప్పారావు, కాసులమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.



గున్నెంపూడిలో ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, అధికార్లు

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం –ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మున్సిపాలిటీ 16వ వార్డు శారదనగర్‌లో బలిఘట్టం అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయన ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలోని 78 సచివాలయాల్లో ఇప్పటికే 35 సచివాలయాల్లో వైద్య శిబిరాలు జరిగాయన్నారు. మెడికల్ ఆఫీసర్ కె.వి.మాధుర్య, డా.సంతోష్, స్పెషలిస్టులు డా.మల్లికార్జున్, డా.అనుతేజ రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు, వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీను, వైద్య సిబ్బంది నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్య సౌకర్యాలు చేరాయని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని వారాడ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారాడ, యడ్లవానిపాలెం, చిరికివానిపాలెం గ్రామాలకు చెందిన 367 మంది వైద్య సేవలు పొందినట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శైలజ తెలిపారు. సర్పంచ్ గొంద్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొంద్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని జి.వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి జి.నగరం, సుభద్రయ్యపాలెం, జి.వెంకటాపురం గ్రామాల నుంచి 341 మంది రోగులు హాజరై, వైద్య సేవలు పొందారు. ఈవోపీఆర్డీ సీతా మహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, సీహెచ్‌వో రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెట్ల భద్రాచలం, బంగారు గంగరాజు, గాంధీ పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు అన్నారు. మండలంలోని గుమ్మడిగొండ సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఎంపీడీవో హనుమంతరావు, గుమ్మడిగొండ, వెదురుపల్లి సర్పంచులు పంచాడ పాప, కాళ్ల సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు సుర్ల పాప, ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం అధికారి నేతల ప్రశాంతి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జె.చినబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు కాళ్ల సత్యనారాయణ వైద్యాధికారులు ప్రసన్న, పద్మప్రియ, రాజ్, రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదవారికి జగనన్న ఆరోగ్య సురక్ష వరంగా మారిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని ఎం.కె.పట్నం సచివాలయ పరిధిలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ధనలక్ష్మి, శ్రీనివాసరాజు, సునీత, రేవతి పాల్గొని 240 మంది రోగులకు అవసరమైన పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించారు. విప్ ధర్మశ్రీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మి శ్రీనివాస్, పోతల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలోని పొంగలిపాక గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 350 మందికి వైద్య సేవలు అందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ కె.మాలంనాయుడు, లీలా ప్రసాద్, సంతోష్‌కుమార్, అభినవ్ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. ఎంపీడీవో మీనాకుమారి, సర్పంచ్ నాయన దేముడమ్మ, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మైచర్ల సన్యాసిరావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు నాయన ధన, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరావు, సీడీపీవో శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉండూరు దేముడు పాల్గొన్నారు.



పొంగలిపాకలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాజారామ్



కేస్‌షీట్, మందులను అందిస్తున్న అనురాధ, జగన్‌మోహన్



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గణేష్



గాంధీగ్రామంలో ఐసీడీఎస్ పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ



వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుంటున్న విప్ ధర్మశ్రీ



మాకవరపాలెంలోని జి.వెంకటాపురం శిబిరంలో వైద్య సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యుడు